క్లుప్తంగా

సబ్సిడీ రుణాల దరఖాస్తుకు నేడు తుది గడువు

మద్దిపాడు: మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ఈడబ్ల్యూసీ, బీసీ వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు శనివారం సాయంత్రంతో గడువు ముగుస్తుందని ఎఫ్ఏసీ ఎంపీడీవో ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

25 మంది వృద్ధులకు దోమతెరల పంపిణీ

ఒంగోలు టౌన్: వృద్ధుల ఆరోగ్యం విషయంలో కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని విశ్వమానవ సంక్షేమ సంఘ వ్యవస్థాపకుడు పెసల మస్తాన్‌రావు సూచించారు. శుక్రవారం ఒంగోలు కమ్మపాలెం ఎక్స్‌టెన్షన్‌లో గల వృద్ధాశ్రమంలో ఉంటున్న 25 మంది వృద్ధులు, నిరుపేదలకు సంఘం తరపున దోమతెరలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విశ్రాంత ఇంజినీర్ అప్పలరాజు, సంఘ గౌరవాధ్యక్షుడు గురవారెడ్డి, ఆశ్రమ నిర్వాహకురాలు లీలారాణి, సంస్థ సభ్యులు రాధాకృష్ణ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులకు బాసటగా ఉండాలి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రవికుమార్

సంతనూతలపాడు: చట్టబద్ధంగా దివ్యాంగులకు రావాల్సిన సంక్షేమ పథకాలు అమలుచేసి వారి అభ్యున్నతికి బాసటగా ప్రభుత్వం నిలవాలని జిల్లా లోక్ అదాలత్ కోర్టు స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్ కోరారు. ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి, స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు సంతనూతలపాడు మండలంలో దివ్యాంగుల సంక్షేమం కోసం అవగాహన కల్పించేందుకు 15 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎండ్లూరు గ్రామంలో పర్యటించారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీర్ పాటిబండ్ల సతీష్, అంగన్‌వాడీ టీచర్ అట్లూరి పద్మ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ జీవనజ్యోతి, ఆశా వర్కర్లు, పలువురు తల్లులు పాల్గొన్నారు.

కలుషిత నీరు.. వ్యాధుల జోరు..!

- ఒంగోలు రాంనగర్ 10వ లైన్‌లో మంచినీటి పైపులైన్లకు మరమ్మతుల కోసం తవ్వకాలు
- మరమ్మతుల అనంతరం పూడ్చని గుంతలు
- పైపులైన్లలో మురికినీరు చేరి కలుషిత నీరు సరఫరా
- ఆ నీరు తాగి అస్వస్థతకు గురవుతున్న ప్రజలు
- పది రోజులైనా పట్టించుకోని అధికారులు




పైపులైన్ల మరమ్మతుల కోసం తవ్వి వదిలేసిన గుంతలు

ఒంగోలు వన్‌టౌన్: నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా స్థానిక రాంనగర్ 10వ లైను, అంబేడ్కర్‌కాలనీ వాసులు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురవుతున్నారు. రాంనగర్ 10వ లైన్‌లోని మంచినీటి పైపుల నుంచి కొంతకాలంగా మురికినీరు సరఫరా అవుతోంది. ఈ విషయంపై స్థానికులు అనేకసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. చివరకు వారం రోజుల క్రితం రాంనగర్ 10వ లైన్‌లో మంచినీటి పైపులకు మరమ్మతుల నిమిత్తం తవ్వారు. అప్పటి నుంచి నీటి సరఫరా కూడా నిలిపివేశారు. అయినప్పటికీ.. పైపులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయకపోగా, గుంతలు పూడ్చకుండా అలాగే వదిలేశారు. కొంతకాలంగా మంచినీటి పైపుల్లో మట్టి నీరు, కాలువల్లోని మురికినీరు చేరి ప్రజలకు సరఫరా అవుతోంది. ఎర్రగా, నల్లగా, తీవ్రమైన దుర్గంధంతో నీరు సరఫరా అవుతుండగా, గత్యంతరం లేక అవే నీటిని రాంనగర్ 10వ లైను, అంబేడ్కర్‌కాలనీ ప్రజలు వాడుకుంటున్నారు. చివరకు ఆ నీటినే తాగి అస్వస్థతకు గురవుతున్నారు.

ఆస్పత్రి పాలవుతున్న ప్రజలు...

మంచినీటి పైపులైన్లలో ఏకంగా మురికి కాలువలోని నీరు కలుస్తుండటంతో తాగునీరు కలుషితమై కొందరు ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలవుతున్నారు. ఎక్కువగా వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారు. వైద్యం కోసం వేలకు వేలు వైద్యశాలలకు చెల్లించుకుంటున్నారు. రాంనగర్ ప్రాంతంలో భూగర్భ జలాలు తీవ్ర ఉప్పుమయమై ఉంటాయి. కనీసం వాడుకునేందుకు కూడా పనికి రావు. దీంతో స్థానికులు నగరపాలక సంస్థ సరఫరా చేసే కలుషిత నీటినే వాడుకుంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా, గుంతలు తవ్వి వారం రోజులవుతున్నా.. నీటి సరఫరా నిలిపివేసినా.. పైపులైన్లకు పూర్తిగా మరమ్మతులు చేసి గుంతలు పూడ్చకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. పైపులకు మరమ్మతుల కారణంగా నీటి సరఫరా నిలిపివేసి ఏడు రోజులైనా కనీసం ట్యాంకర్ల ద్వారా కూడా మంచినీరు సరఫరా చేయడం లేదు. ఒకేఒక్కరోజు ట్యాంకర్ వచ్చిందని, అనంతరం రాలేదని, మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పుల్వామా అమరవీరులకు అశ్రు నివాళి



పుల్వామా అమరవీరులకు నివాళులర్పిస్తున్న జేసీస్ సభ్యులు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు

ఒంగోలు సిటీ: పుల్వామా అమరవీరుల త్యాగాలు వృథా కాకూడదని, ప్రతి ఒక్క భారతీయుడు దేశం పట్ల ప్రేమతో మెలగాలని జేసీఐ ఒంగోలు అధ్యక్షుడు జేసీ సుబ్బారావు కోరారు. శుక్రవారం పుల్వామా అమరవీరుల సంస్మరణ సభను జేసీఐ ఒంగోలు ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రకేసరి విద్యా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి పెంపొందించుకోవాలని, తద్వారా దేశ రక్షణకు పాటుపడాలని కోరారు. ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 14, 2019 భారతదేశానికి ఒక దుర్దినమని, 40 మంది సైనికులను తీవ్రవాదులు హతమార్చారని తెలిపారు. వారిని గుర్తు చేసుకుని వారి త్యాగాలను అందరికీ తెలియజేయడం మన బాధ్యతని అన్నారు. అనంతరం మాజీ సైనికుడు, జేసీఐ ఒంగోలు ట్రెజరర్ జేసీ కసిబిసి నాగబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. జేఏసీ చైర్మన్, శ్రీరామ్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీరాములురెడ్డి, అపెక్స్ పాఠశాల కరస్పాండెంట్ జేసీ శివకోటిరెడ్డి, జేసీ మాల్యాద్రి, జేసీ శ్రీకాంత్, జేసీ బాలసుబ్రహ్మణ్యం, జేసీ వరుణ్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, జేసీ డాక్టర్ రవికుమార్, జేసీ శ్రీనివాసరావు, జేసీ బాషా, జేసీ శివారెడ్డి తదితరులు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో...

ఒంగోలు మెట్రో: జమ్మూకాశ్మీర్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు 40 మంది మరణించిన రోజైన ఫిబ్రవరి 14ను బ్లాక్ డేగా జరుపుకుంటున్నట్లు వాసవీ క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు, వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు కొప్పురావూరి భరతసింహ తెలిపారు. ఒంగోలు నగరంలోని బండిమిట్ట సెంటర్లో కార్గిల్ స్థూపం వద్ద వాసవీ క్లబ్ ఒంగోలు, వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అమర జవానులకు నివాళులర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి జోహార్లు పలికారు. కార్యక్రమంలో కార్యదర్శులు మద్దాలి శివప్రసాద్, కోశాధికారులు, జోన్ చైర్మన్ పబ్బిశెట్టి గోవర్ధన్, రీజియన్ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, అధికారులు దర్శి మనోహర్ చంద్రశేఖర్, నేరెళ్ల శ్రీనివాసరావు, రాధా రమణ గుప్తా జంధ్యం, స్వర్ణ సాయి, తదితరులు పాల్గొని అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

గొడుగు మస్తాన్‌కు ఘన నివాళులు



గొడుగు మస్తాన్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంతనూతలపాడు: వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు, జిల్లా నూర్ బాషా సంఘ అధ్యక్షుడు గొడుగు మస్తాన్ దశదిన కర్మను శుక్రవారం మండలంలోని మైనంపాడు గ్రామంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు బొల్లినేని కృష్ణయ్య, ఎంపీపీ విజయ, సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, ఇతర పార్టీల నాయకులు హాజరై ఘనంగా నివాళులర్పించారు. మస్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అతని కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు. వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, మైనంపాడు సర్పంచి డి.రమణ, ఎంపీటీసీ రాజకుమారి, సంతనూతలపాడు, మద్దులూరు, లక్ష్మీపురం సర్పంచులు దర్శి నాగమణి, ఎం.శైలజ, రామానాయుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యల్లమందారెడ్డి, పాటిబండ్ల గంగయ్య, మోహన్, ఎంపీటీసీ ఎస్.కె.రంతుల్లా, వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు దమ్మల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ జి.సుబ్బారావు, ఐ.వి.సుబ్బయ్య, మాజీ సర్పంచ్ ఆర్.సీతారామయ్య, పలు గ్రామాల నాయకులు, టీడీపీ, సీపీఎం నేతలు పాల్గొని మస్తాన్‌కు నివాళులర్పించారు.

21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ఒంగోలు మెట్రో: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, కళాకారులు, రచయితలు, విద్యావేత్తలు, భాషాభిమానులు పాల్గొనాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి మర్కస్ మసీదు

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక పత్తివారివీధిలోని మర్కస్ మసీదును వక్ఫ్‌బోర్డు తన ఆధీనంలోకి తీసుకుంది. మసీదులోని రెండు వర్గాలు హైకోర్టుకు వెళ్లడంతో మసీదును నిర్వహించాలని వక్ఫ్‌బోర్డును కోర్టు ఆదేశించింది. అనంతరం మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలని కోర్టు సూచించింది. కోర్టు తీర్పు ప్రకారం మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో వక్ఫ్‌బోర్డు అధికారులు మసీదును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గురువారం వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ జుబెర్ మసీదుకు సంబంధించిన 24 దుకాణాలకు నోటీసులు అందించారు. మూడు సంవత్సరాలకు ఒకసారి దుకాణాల అద్దె సవరించాల్సి ఉండగా, గత 25 సంవత్సరాలుగా సవరించలేదు. దాదాపు రూ.78 లక్షలకుపైగా దుకాణదారులు బకాయిలున్నట్లు సమాచారం.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ భాస్కర్

చీమకుర్తి రూరల్: వ్యవసాయ భూమి గల ప్రతి రైతుకూ ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్య ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరంగా పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు మండల వ్యవసాయ అధికారి డీవీ భాస్కర్ తెలిపారు. అందుకోసమే రైతులకు 11 నంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను శుక్రవారం చీమకుర్తి మండలంలోని బూదవాడ సచివాలయంలో ఆయన పరిశీలించారు. రైతులంతా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. ఇకపై అన్ని పథకాలకు ఇదే కీలకంగా మారుతుందన్నారు. విశిష్ట సంఖ్య నమోదు చేసుకున్న రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మపోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాల ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ సచివాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి ఈ సంఖ్య పొందవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని రైతు సేవా సిబ్బందిని కలిస్తే విశిష్ట సంఖ్య పొందవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం



స్వామివారు, అమ్మవార్ల కళ్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు

ఒంగోలు మెట్రో: స్థానిక కర్నూలు రోడ్డులోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి 17వ వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇంకొల్లు మధుసూదనాచార్య పర్యవేక్షణలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస బిర్లా, పేలప్రోలు బ్రహ్మానందం దంపతులు, వారి కుటుంబ సభ్యులు కళ్యాణ ఉభయదాతలుగా వ్యవహరించారు. అర్చకుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ అట్టహాసంగా స్వామివారి కళ్యాణం సాగగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. అనంతరం కళ్యాణానికి విచ్చేసిన భక్తులకు రుత్వికులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రుత్వికులు నల్లపాటి కుమారస్వామి, ఏల్చూరి ప్రదీప్‌శాస్త్రి, పాలెపు వెంకటేశ్వరశర్మ, నూతలపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదు పూర్తి చేయాలి



సంతనూతలపాడులో సమీక్షిస్తున్న ఎంపీడీఓ సురేష్‌బాబు



నాగులుప్పలపాడులో మాట్లాడుతున్న ఎంఈవో రవి



మద్దిపాడు: మాట్లాడుతున్న సీడీపీఓ ఇవాంజిలిన్

సంతనూతలపాడు: బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్కరూ బాలల బంగారు భవిష్యత్తుకు పాటుపడాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బంగారు బాల్యంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరినీ బడుల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీపీ బుడంగుంట విజయ, ఎంఈఓ డి.వెంకారెడ్డి, వెలుగు ఏపీఎం టి.బాబూరావు, ఏపీవో వాసంతి, ఆరోగ్యశాఖ ప్రతినిధులు శేషారావు, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదు పూర్తి చేయాలి

మద్దిపాడు: మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ఉన్న 6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదును నూరు శాతం పూర్తిచేయాలని అంగన్‌వాడీలను సీడీపీఓ ఇవాంజెలిన్ ఆదేశించారు. అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులతో శుక్రవారం మద్దిపాడులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 18 సంవత్సరాల్లోపు పిల్లల పోషణ, ఆరోగ్యం, విద్య, తదితర అంశాలపై గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలు సమావేశమై తీర్మానాలు చేయాలన్నారు. ముఖ్యంగా బాలికల్లో డ్రాపవుట్లను తగ్గించాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ రఘుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: బంగారు బాల్యం కార్యక్రమంపై ఎంఈఓ కే శివాజీ శుక్రవారం చీమకుర్తి అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంఆర్‌సీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేసి పలు విషయాలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఎంఈఓ తెలిపారు.



చీమకుర్తిలో మాట్లాడుతున్న ఎంఈఓ

ప్రతి చిన్నారికి గుర్తింపు కార్డు తప్పనిసరి

నాగులుప్పలపాడు: బంగారు బాల్యంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల సిబ్బందితో ఎంఈవో రవి సమీక్ష సమావేశం నిర్వహించారు. 0–6 సంవత్సరాల చిన్నారులకు తప్పకుండా ఆధార్ కార్డుకు నమోదు చేయించాలని సూచించారు. మిగతా గుర్తింపు కార్డులు కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఏవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పోలీసు సిబ్బందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏవో దక్షిణామూర్తి, సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలి



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తపట్నం: రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి, కార్మికుల హక్కులు కాపాడుకోవడానికి మార్చి 24న చలో పార్లమెంట్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఆటో కార్మికులు, కొత్తపట్నం, మోటుమాల, గుండమాల రూటు ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. తోట బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా, శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని రవాణా కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బస్టాండ్ కూడలిలో బడ్జెట్‌లో రవాణా రంగానికి కేటాయింపులు, సంక్షేమ చట్టం ఊసే లేదంటూ సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.సోమిరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు బ్రహ్మయ్య, వీరాంజనేయులు, నాగరాజు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక ప్రకటన

మా క్లైంటు కాశ సత్యవతి భర్త వెంకటరామశెట్టి మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా తేదీ: 12-02-2025న (బుధవారం) ఉదయం 11.00 గంటల సమయంలో గానుగపాలెం నుండి కోర్టు సెంటరు బయలుదేరుతూ ఒక సంచీలో తనకు సంక్రమించిన అస్తి తాలూకు లింకు దస్తావేజు నెం. 1896/1964 ఒంగోలు సబ్-రిజిష్ట్రరులో రిజిష్టరు కాబడి నటువంటి ఒరిజినల్ దస్తావేజు ఎక్కడో జారి పడిపోయినది. తిరిగి ఎంత వెతికినప్పటికిని దొరికి యుండలేదు. కావున సదరు దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల క్రింది తెలిపిన మా క్లైంటు అడ్రసుకుగాని లేదా న్యాయవాదికి గాని అందజేయగలరని కోరుతున్నారు. అంతేకాక సదరు దస్తావేజు ఆధారంగా ఎటువంటి లావాదేవీలు ఎవరు కూడా జరుపరాదని కోరుచున్నారు.

కాశా సత్యవతి W/o.వెంకటరామశెట్టి గానుగపాలెం, ఒంగోలు. సెల్:9849261420.	టీటీ శ్రీనివాసులు న్యాయవాది ఒంగోలు. సెల్:9440472986

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



ఒంగోలులో నివాళులర్పిస్తున్న నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు



ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న కార్యదర్శి, సిబ్బంది

ఒంగోలు మెట్రో: స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సాహిత్య సాంస్కృతిక కళారంగ ప్రతినిధులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనుమాల రాఘవులు, నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కళామిత్ర మండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, ఆదాయపు పన్నుశాఖ విశ్రాంత అధికారి మెడబలిమి సాంబశివరావు, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు బస్టాండ్ సెంటర్లో మాలల ఐక్యవేదిక ప్రకాశం జిల్లా ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘ అధ్యక్షుడు వాసుమల్లి నాగార్జున, కవి, రచయిత చప్పిడి కోటేశ్వరరావు, పక్కెల వజ్రంబాబు, మెడికొండ మురళి, యాదాల నాగరాజు, కందుల కృష్ణబాబు, నూకతోటి రాము, స్టాలిన్, తెలగతోటి పృథ్వి, జెట్టి కమలాకర్, చింతపల్లి రమేష్, తెలగతోటి సుబ్బయ్య, శివ, పెదపూడి సురేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థలో...

దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య చరిత్ర సృష్టించారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి చెప్పారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహించి మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద గల మహిళా ప్రాంగణంలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మహిళా ప్రాంగణ జిల్లా మేనేజర్ వై.అంజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 15 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా చిల్లకర్ర కొట్టడంపై విచారణ

మద్దిపాడు: అక్రమంగా చిల్లకర్ర కొట్టడంపై మద్దిపాడు పంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ రఘుబాబు శుక్రవారం విచారణ నిర్వహించారు. మద్దిపాడు గ్రామ సర్పంచ్ ఎం.వెంకటేశ్వర్లు హాజరై తన సంజాయిషీ అందించారు. గత సంవత్సరం నవంబరు నెలలో జరిగిన గ్రామ పంచాయతీ సాధారణ సమావేశంలో గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ చేయడానికి పంచాయతీ పాలకమండలి ఆమోదం తెలిపింది. అయితే, అవగాహనా లోపం వలన సదరు కాలనీలో జంగిల్ క్లియరెన్స్ చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని, గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కొడుతున్న చిల్లచెట్లను తాము స్వాధీనం చేసుకున్నామని, సదరు చిల్లచెట్లతోపాటు మిగిలిన చెట్లనూ ఉన్నతాధికారుల అనుమతితో బహిరంగ వేలం ద్వారా విక్రయించి గ్రామ పంచాయతీ ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వివరణ ఇచ్చినట్లు తెలిసింది.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ...

మద్దిపాడు గ్రామ శివారులో పంచాయతీకి చెందిన ఖాళీ స్థలంలో ఉన్న చిల్లచెట్లను కొందరు అక్రమంగా కొట్టుకుని తీసుకెళ్తున్నారని, దీనివలన మద్దిపాడు గ్రామ పంచాయతీ లక్షల్లో ఆదాయం కోల్పోతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 5వ తేదీ గ్రామానికి చెందిన మద్దా లక్ష్మీనారాయణ ఒంగోలులో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పంచాయతీ కార్యదర్శి షేక్ నూరుల్లా సదరు చెట్ల అక్రమ నరికివేతను నిలువరించి విచారణ చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులకు త్వరలో విచారణ నివేదిక అందజేయనున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ని ఆదేశించారు.